సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం ı 1 ı మార్చి ı 2024



ఘనంగా తులసీదళార్చన
విశాఖలో కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. 8లో



శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం
సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వీక్షించారు. 8లో



గిరి శిఖరాన ప్రగతి'బాట'
గిరి శిఖర గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి భారీగా నిధుల కేటాయింపుతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

నేడు ఐటీడీఏలో జగనన్నకు చెబుదాం

సాక్షి,పాడేరు: స్థానిక పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయసునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్నిశాఖల అధికారులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

'ఏకలవ్య'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజవొమ్మంగి: ఏకలవ్య పాఠశాల (ఈఎంఆర్ఎస్, సీబీఎస్ఈ సిలబస్‌తో నడుస్తున్న ఇంగ్లీష్ మీడియం)ల్లో 2024-25 విద్యాసంవత్సరం 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్, కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. ప్రతీ పాఠశాలలో ఆరవ తరగతిలో బాలికలకు 30, బాలురకు 30 చొప్పున 60 సీట్లు ఉన్నాయన్నారు. తమ పరిధిలో చింతూరు, రాజవొమ్మంగి, వై. రామవరం, మారేడుమిల్లి, రంపచోడవరం, అడ్డతీగలలో ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న బ్యాక్ లాగ్ సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మార్చి 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు రాత పరీక్ష ఏప్రిల్ 13వ తేదీన జరుగుతుందన్నారు. మిగతా వివరాలకు సమీపంలోని గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తులు httpr://a ptwfuru kuam.ap.gov.inలో ఆన్‌లైన్ చేయాలన్నారు.

టేకు చెట్ల నరికివేతపై దర్యాప్తు



టేకు చెట్ల నరికివేతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మారేడుమిల్లి : ఇక్కడికి సమీపంలోని గాలిగోపురం వద్ద రహదారి పక్కనే ఉన్న టేకు ప్లాంటేషన్‌లో చెట్ల నరికివేతపై అటవీశాఖ అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు. గిరిజనుల నుంచి అందిన సమాచారం మేరకు గురువారం డీఎఫ్‌వో త్రిమూర్తులురెడ్డి, డీఆర్వో రాజు, మారేడుమిల్లి రేంజ్ అధికారి శివ రామకృష్ణ, సెక్షన్ అఫీసర్ సుమంత్, ఎఫ్‌బీవోలు రాజుబాబు, శ్రీనివాస్, స్క్వాడ్ బృందం నరికివేతకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. సుమారు 32 చెట్లు నరికినట్టు గుర్తించారు. ఇటీవల పట్టుబడిన 50 టేకు దుంగల్లో ప్లాంటేషన్‌కు సంబంధించినవి ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రం తనిఖీ



నర్సింగ్ స్కూల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ ఏఎన్ఎం శిక్షణా కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. మెనూను పరిశీలించారు. సిద్ధం చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు. ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది అంతా ప్రతి రోజు విధులకు హాజరుకావాలని నాణ్యమైన నర్సింగ్ విద్యా బోధనతో పాటు విద్యార్థినులకు పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం మినుములూరు పీహెచ్‌సీని బుధవారం రాత్రి తనిఖీ చేశారు. రాత్రి విధుల్లో ఉన్న సిబ్బందిని ఆయన అభినందించారు. 24గంటల సేవల ఆస్పత్రి కావడంతో వైద్యసిబ్బంది రాత్రి సమయంలో కూడా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.అలాగే పల్స్ పోలియోకు సంబంధించి వ్యాక్సిన్ కారియర్స్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

4న ఉత్తరాంధ్ర మహిళా దినోత్సవం

కొమ్మాది: మాధవధారలో ఈ నెల 4న ఉత్తరాంధ్ర మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణ కుమారి తెలిపారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేడుకలకు ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు పాల్గొంటున్నారన్నారు.

సులభం.. సత్వరం..

ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు



ఈమె పేరు వంతల కాంత్రి. స్వగ్రామం బూదరాళ్ల పంచాయతీ కునుకూరు. భర్త వంతల సిల్కు 2018లో మరణించారు. గత ప్రభుత్వంలో మరణ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. రెండు నెలల క్రితం దరఖాస్తు చేయగా కొద్దిరోజుల్లోనే మంజూరైంది. గ్రామసచివాలయం, వలంటీర్ వ్యవస్థ వల్లే సాధ్యమైందని ఆమె తెలిపింది. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని పేర్కొంది.

ఇప్పుడు పింఛను కోసం దరఖాస్తు చేశా



ఈమె పేరు గెమ్మెలి బిరుసు. ఈమె కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల స్వగ్రామం. భర్త 2009లో చనిపోయారు. అప్పటిలో మరణ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. దీనివల్ల అర్హత ఉన్నా వితంతు పింఛను పొందేందుకు వీలు లేకుండా పోయింది. ఇప్పుడు వలంటీర్ సహకారంతో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేయగానే ధ్రువపత్రం మంజూరైంది. వితంతు పింఛనుకోసం దరఖాస్తు చేశా.

- జనన, మరణ ధ్రువపత్రాల జారీలో నిబంధనల సడలింపు
- గత ప్రభుత్వంలో అర్జీదారులకు నానా అవస్థలు
- ఇప్పుడు దరఖాస్తు చేసిన 15 రోజుల్లోపే మంజూరు
- గిరిజనులకు తప్పిన అవస్థలు
- గ్రామసచివాలయ, వలంటీర్ వ్యవస్థతో సత్ఫలితాలు
- ఆరునెలల వ్యవధిలో 34,400 మందికి జారీ

రాష్ట్ర ప్రభుత్వం పాలనలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు గిరిజనులకు అవస్థలను దూరం చేశాయి. ప్రధానంగా జనన మరణ ధ్రువపత్రాలు పొందేందుకు గత ప్రభుత్వంలో నరకం చూసేవారు. దరఖాస్తు చేసిన తరువాత నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం ధ్రువపత్రాల మంజూరుకు సంబంధించిన నిబంధనలను సులభతరం చేసింది. దరఖాస్తు చేసిన వారం రోజులలోపే జారీ చేసేలా చర్యలు తీసుకుంది.

కొయ్యూరు: జిల్లాలో గిరిజనులు జనన మరణ ధ్రువపత్రాలను దరఖాస్తు చేసిన వారం రోజుల్లోపే పొందగలుగుతున్నారు. గత ప్రభుత్వంలో సకాలంలో ధ్రువపత్రాలు మంజూరు కాక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యేవారు. ధ్రువపత్రాలు పొందాలంటే ముందుగా పంచాయతీ కార్యదర్శి నుంచి నాన్ ఎవైలబుల్ సర్టిఫికెట్ తీసుకుని నోటరీ చేయించాలి. ఇందుకు నిమిత్తం సమీప పట్టణానికి వెళ్లి అర్హత గల న్యాయవాది నుంచి పొందాలి. ఇందుకు సుమారు రూ.వెయ్యి వరకు ఖర్చయ్యేది. తరువాత మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేస్తే అక్కడి నుంచి వీఆర్వో ద్వారా ఆర్ఐ లాగిన్‌కు వెళ్లేది. ఆయన విచారణ అనంతరం తహసీల్దార్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరేది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి నెలలు.. కొన్ని సందర్భాల్లో ఏడాదికి పైగా సమయం పట్టేది.



జనన, మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసేందుకు బూదరాళ్ల సచివాలయానికి వచ్చిన గిరి మహిళలు

ఆరు నెలల నుంచి..

గత ఆరు నెలల నుంచి జారీ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. వలంటీర్ ద్వారా గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేస్తే సరిపోతుంది. జననం/మరణానికి సంబంధించిన వివరాలు తెలియజేస్తే ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేస్తారు. అక్కడి నుంచి రెవెన్యూ లాగిన్‌కు వెళ్తుంది. దరఖాస్తు ఎక్కడ ఎన్ని రోజులు ఉందో తెలియడం వల్ల వెంటనే ధ్రువపత్రం జారీకి కలెక్టరేట్ నుంచి ఆదేశాలు జారీ అవుతున్నాయి. మొత్తంమ్మీద వారం రోజుల్లోపే ధ్రువపత్రం మంజూరవుతోంది. గత ఆరునెలల వ్యవధిలో జిల్లాలోని 22 మండలాల పరిధిలో 34,400 మందికి జనన/మరణ ధ్రువపత్రాలను జారీ చేశారు. ఇలా తక్కువ సమయంలో జారీ కావడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నోటరీ అవస్థలు తప్పాయి



గ్రామ సచివాలయ వ్యవస్థ రాకముందు జనన మరణ ధ్రువపత్రం పొందేందుకు ఇబ్బందులు పడేవారు. పట్టణాలకు వెళ్లి నోటరీ చేయించి కార్యాలయాల చుట్టూ తిరిగే వారు. నెలల తరబడి ఎదురు చేసినా మంజూరయ్యేది కాదు. ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. ఇప్పుడు అవస్థలు, ఎదురుచూపులు తప్పాయి. దరఖాస్తు చేసిన కొద్ది రోజుల్లోనే ధ్రువపత్రం మంజూరవుతోంది.

– వంతల హక్కు,
వలంటీర్, కునుకూరు, కొయ్యూరు మండలం

త్వరితగతిన ధ్రువపత్రాల జారీ



పాడేరు సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో 20 వేలకు పైగా జనన మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేశాం. గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. వెంటనే పరిశీలన చేసి మంజూరు చేస్తున్నారు. ఇప్పుడు జారీ ప్రక్రియ సులభతరమైంది. దీనివల్ల గిరిజనులకు అవస్థలు తప్పాయి. దరఖాస్తులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– వి.అభిషేక్, పీవో, ఐటీడీఏ, పాడేరు

3న భద్రాద్రి రాముడి ప్రత్యేక కల్యాణం



సతీసమేతంగా భద్రాద్రి రాముడు



ప్రచారానికి రానున్న స్వామివారి రథం

వీఆర్‌పురం: శ్రీరామగిరి శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మండపంలో మార్చి 3వతేదీన భద్రాద్రి రాముడి ప్రత్యేక కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు, ఆలయ చైర్మన్ దేవు బాలరాజు తెలిపారు. భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక రథాన్ని ఏర్పాటు చేసి గిరిజన గ్రామాల్లో పర్యటిస్తూ ఊరూరా రామాయణం విశిష్టతను తెలియజేస్తూ ప్రచారం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. దీనిలో భాగంగానే మార్చి 3వతేదీన ప్రచార రథం శ్రీరామగిరి చేరుకుంటుందని తెలిపారు. కొండ దిగువ ఏటా సుందర సీతారామచంద్రస్వామి వారికి కల్యాణం నిర్వహించే నిర్వహించే మండపంలోనే భద్రాద్రి రామునికి ప్రత్యేక కల్యాణం నిర్వహిస్తామని వారు తెలిపారు.

ఎన్నికల విజయవంతానికి పటిష్ట ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు వెళుతున్న కలెక్టర్ విజయసునీత, ఎస్పీ తుహిన్‌సిన్హా, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్

- కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- స్ట్రాంగ్ రూంల పరిశీలన
- అధికారులతో సమీక్ష

సాక్షి,పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయ సునీత ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలను కలెక్టర్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఏఎస్పీ ధీరజ్ గురువారం సందర్శించారు. అరకు పార్లమెంట్, పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాలకు వేరువేరుగా స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, తగిన రవాణా వాహనాలను ఏర్పాటు



స్ట్రాంగ్ రూంలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ విజయ సునీత

చేయాలని ఆదేశించారు. అలాగే ఈవీఎంలు భద్రపరిచిన వేర్‌హౌస్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ భద్రత ఏర్పాట్లు, అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల వ్యవస్థపై ఎస్పీ తుహిన్‌సిన్హా, ఏఎస్పీ ధీరజ్‌తో కలెక్టర్ విజయసునీత సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ అంబేడ్కర్, సీఐ నవీన్‌కుమార్, జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- ప్రచార రథాలు ప్రారంభం



ప్రచార రథాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: సికిల్‌సెల్ ఎనీమియా రహిత సమాజమే లక్ష్యమని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో భాగంగా అమరావతి నుంచి సాంఘిక సంక్షేమశాఖ పంపిన ప్రచార రథాలను గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలన లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 35 ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1550 గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రచారానికి ఆరు రథాలను వినియోగిస్తున్నామన్నారు. వీటిలో రెండు రాగా, మిగతా నాలుగు తొందరలోనే ఇక్కడికి చేరుకుంటాయన్నారు. గ్రామాల్లో నిర్వహించే ప్రచారంలో సంబంధిత పీహెచ్‌సీ వైద్యుడు,సిబ్బంది భాగస్వాములు కావాలన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 1.10లక్షల మందికి సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, 1050 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. వారికి నిర్వహించిన నిర్ధారణ పరీక్షల్లో 650 మంది రోగులను గుర్తించామని వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వ నుంచి పింఛను పొందేలా సిఫార్సు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్, పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, పాడేరు జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర ప్రచార రథాలను పరిశీలించారు.

టెట్‌కు 90.69 శాతం హాజరు

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ పరీక్ష(టెట్-2024) మూడో రోజు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షకు 4,224 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 3,831 మంది హాజరయ్యారు. 90.69 శాతం హాజరు నమోదైంది.

27 కేంద్రాలు.. 13,245 మంది విద్యార్థులు

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు
- పూర్తిస్థాయిలో సౌకర్యాలు, బందోబస్తు





పాడేరు జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో సిద్ధం చేసిన బెంచీలు, అమర్చిన సీసీ కెమెరా

సాక్షి,పాడేరు: ఇంటర్ పరీక్షలు శుక్రవారం నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 22 మండలాల విద్యార్థులకు సంబంధించి పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో 27పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు.

● రెగ్యులర్, ఒకేషనల్, ప్రైవేట్‌కు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరంలో 7400 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,845 మంది మొత్తం 13,245 మంది పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. పరీక్ష రాసే సమయంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా సకాలంలో వైద్యసేవలు అందించేందుకు వైద్యబృందాలు పరీక్ష కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటాయి. ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయి. పది నిమిషాల ముందుగానే పరీక్ష కేంద్రానికి రావాలని అధికారులు సూచించారు.

● ఇంటర్ పరీక్షలలో మాస్ కాపీయింగ్, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్‌బోర్డు అధికారులు అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీసుల సేవలను ఇంటర్ పరీక్షలకు వినియోగిస్తున్నారు.

ఆల్‌ది బెస్ట్: ఎంపీ మాధవి

కొయ్యూరు: ఇంటర్ విద్యార్థులు పరీక్షలను బాగా రాయాలని అరకు ఎంపీ మాధవి ఆకాంక్షించారు. గురువారం ఆమె స్వగ్రామం శరభన్నపాలెంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఆమె ఆల్ ది బెస్ట్ తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద నిఘా



ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించే లక్ష్యంతో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశాం. జిల్లాలోని 27 పరీక్షా కేంద్రాలకు 27 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 27మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 297మంది ఇన్విజిలేటర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాం. పరీక్షా కేంద్రాలు,గదుల్లో సీసీ కెమెరాల నిఘా ఉంది. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తాం.

– మద్దిలి వినోద్‌బాబు,
జిల్లా పర్యవేక్షకుడు, ఇంటర్ బోర్డు

గిరి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- కేవీకే కోఆర్డినేటర్ లలితాకామేశ్వరి



మాట్లాడుతున్న వీరాంజనేయులు

రంపచోడవరం: గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందని కేవీకే కోఆర్డినేటర్ డా.లలితాకామేశ్వరి తెలిపారు. ఈ కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ,హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో అలంకరణ చేపల ఉత్పత్తి, యాజమాన్య పద్ధతులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కుటీర పరిశ్రమగా ఆక్వేరియం తయారీ, అలంకరణ చేపల ఉత్పత్తితో స్థానిక యువత ఉపాధి పొందవచ్చన్నారు. మత్స్య విభాగం శాస్త్రవేత్త కె. వీరాంజనేయులు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు శిక్షణలో అక్వేరియం తయారీ, వాటిలో వినియోగించు అలంకరణ వస్తువులు, చేపల ఎంపిక వంటి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణలో అవగాహన పొందిన అంశాలతో సొంతంగా తయారు చేసే విధంగా గిరిజన యువత ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌వో కె చిట్టిబాబు, కేవీకే శాస్త్రవేత్తలు టి. క్రాంతికుమార్, చిరంజీవి, మత్స్యశాఖ అధికారి సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

జాతర జనసంద్రం



గద్దెలను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

సమ్మక్క,సారక్కను దర్శించుకున్న భక్తజనం

ఎటపాక: మినీ మేడారం మారాయిగూడెం సమ్మక్క సారక్క జాతర జన సంద్రమైంది. మూడవరోజు గురువారం నిండు జాతర సందర్భంగా మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు గద్దెలను దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వనదేవతను గద్దెల వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అదేవిధంగా సాయంత్రం 4గంటలకు తల్లి దేవతను గుట్ట నుంచి గుడికి తీసుకురావటంతో గద్దెల వద్ద నిండుతనం సంతరించుకుంది. వేలాది మంది భక్తులు వన దేవతలను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఈసందర్భంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో సమ్మక్క,సారక్కలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు వనదేవతను దర్శించుకున్నారు.తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎటపాక జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,కన్నాయిగూడెం ఎంపీటీసీ వర్సా బాలకృష్ణ,ఆదివాసీ సంఘాల నేతలకు గిరిజన పూజారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.



వనదేవతకు పూజలు చేస్తున్న ఎటపాక జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత

ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించాలి

● జిల్లా పరిశ్రమలశాఖ అధికారి శ్రీవాణిధర్



సాక్షి,పాడేరు: జిల్లాలో శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు చేపడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ సర్వేకు ప్రజలంతా సహకరించాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీవాణిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వే ద్వారా ఎంఎస్‌ఎంఈల పనితీరును మెరుగుపరచడంతోపాటు అభివృద్ధిని వేగవంతం చేస్తామన్నారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్, ఏపీఎంఎస్‌ఈ వన్ అనే ఏకీకృత పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న పలు రుణాల పథకాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని పథకాలపై చైతన్యం తీసుకువచ్చి రుణాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి: మండలంలోని ఆకుమామిడికోట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తేడు గ్రామానికి చెందిన పి.రాజారావు, నాగేశ్వరరావు బైకుపై రంపచోడవరం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రంపచోడవరం తరలించారు.

గిరి శిఖరాన ప్రగతి 'బాట'



బోనూరు దగ్గర రోడ్డు నిర్మాణ పనులు



గడ్డిబంద నుంచి బోనూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు

- రూ.17.39 కోట్లతో 10 గ్రామాలకు తారురోడ్లు
- శరవేగంగా రహదారుల నిర్మాణం
- గిరిజనుల్లో వెల్లివిరిసిన ఆనందం
- ప్రభుత్వానికి, అధికారులకు గిరిజన సంప్రదాయంలో ప్రత్యేక కృతజ్ఞతలు

అనంతగిరి: గిరి శిఖర గ్రామాలంటే చిన్నచూపు... అక్కడ కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఈ విధమైన నిర్లక్ష్య ధోరణితో గత టీడీపీ పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వీటిపై ప్రత్యేక దృష్టి సారించింది. దశాబ్దాలుగా కలగానే మిగిలిపోతుందనుకున్న రహదారి సమస్యకు మోక్షం కలిగించింది. డోలీమోతల కష్టాలకు చెక్ పెట్టింది. ఈ మేరకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి పినకోట నుంచి గడ్డిబంద వరకు 12.2 కిలోమీటర్లకుగాను రూ.11.39 కోట్లు, బోనూరు నుంచి పి.గంగవరం వరకు 5.8 కిలోమీటర్లకుగాను రూ.6 కోట్లతో తారురోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

గిరి శిఖర గ్రామాలకు మేలు:

గతంలోని బొర్రాపాలెం, చటకంభ, బోనూరు, చీడిమెట్ట, మెట్టవలస, గడ్డిబంద, జగడలమామిడి, పుతికపుట్టు, తంగెలబంద, పి.గంగవరం గ్రామాల్లో గిరిజనులు అనారోగ్యానికి గురైతే డోలీమోతలపై దట్టమైన అటవీ ప్రాంతంలోని మైళ్లదూరం తరలించాల్సిన దుస్థితి ఉండేది. ఆయా గ్రామాల్లో గిరిజనులు తీవ్ర ఇబ్బందులతో నరకయాతన అనుభవించేవారు. జగడలమామిడికి చెందిన సత్యారావు, రాజులమ్మ దంపతుల రెణ్నెల్ల చిన్నారి కడుపు పొంగి అనారోగ్యానికి గురైంది. పినకోట ఆస్పత్రికి తరలించేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో కాలినడకనే తీసుకెళ్లాల్సి వచ్చింది. సకాలంలో చేరకపోవడంతో అప్పటికే చిన్నారి మృతి చెందింది. ఇలాంటి ఘటనాలెన్నో ఆయా గ్రామాల్లో చోటు చేసుకున్నాయి.



రోడ్డు పనులు ప్రారంభంతో కృతజ్ఞతలు తెలుపుతున్న బోనూరు గిరిజనులు

రెండు వారాల్లో పూర్తి కానున్న పనులు...

పది గ్రామాల్లో గిరిజనులు అనారోగ్యానికి గురైతే డోలీమోత శరణ్యం.. అలాంటి ఇబ్బందికరమైన పరిస్థితులను ఎన్నోయేళ్లుగా ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్న మన సమస్య పరిష్కారం కాదని గిరిజనులు భావించి, శ్రమదానంతో మట్టి రోడ్డు చేసుకుందాం అనుకున్నారు.. గిరిజనుల శ్రమపై సాక్షి దినపత్రికలో కథనాలు వచ్చాయి. దీనిపై స్పందించిన జిల్లా అధికారులు శ్రమదానం కొంత వరకు నిర్మించుకున్న రోడ్డుకు జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి రూ.10 లక్షల వరకు కూలి సొమ్మును చెల్లించారు. అయితే శాశ్వత రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే గిరి శిఖర గ్రామాలు కావడంతో పనుల్లో ఆటంకం నెలకొంది. దీనిపై ఇటీవల సీపీఎం నాయకుడు గోవిందరావుతో కలిసి గిరిజనులు కలెక్టర్, ఐటీడీఏ పీవోకు మొరపెట్టుకున్నారు. దాంతో ప్రస్తుతం పనులు జోరందుకున్నాయి. రెండు వారాల్లో తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తికానున్నాయి.

మేలు చేసిన ప్రభుత్వం..



మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలగానే మిలిగిపోతుందని అనుకున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మిస్తున్నారు. దీంతో మా రహదారి కష్టాలు తీరినట్టే. మా గ్రామాల గిరిజనులు జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– వంతాల రాజు, బొర్రాపాలెం, అనంతగిరి మండలం

త్వరితగతిన పూర్తి చేస్తాం..



తారురోడ్ల పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. పూర్తిగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేస్తున్నాం. ఇవి పూర్తయితే దశాబ్దాలుగా కష్టాలు పడుతున్న గిరిజన గ్రామాలకు ఎంతో మేలు కలుగుతుంది.

– గణేష్, ఏఈ టీడబ్ల్యూ, అనంతగిరి

కేవీకేను సందర్శించిన గోకవరం విద్యార్థులు



కేవీకేను సందర్శించిన విద్యార్థులు

రంపచోడవరం: అగ్రికల్చర్ ఒకేషనల్ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని తూర్పు గోదావరి జిల్లా గోకవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు సందర్శించారు. హెచ్‌ఎం పళ్లాల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ మొక్కలు, జీడిమామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్, తాటి బెల్లం తయారీని పరిశీలించారు. వీరి సందేహాలను కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ లలితా కామేశ్వరి నివృత్తి చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, ప్రదీప్ విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రత గురించి వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ చుక్కా ప్రదీప్, ఆనంద్, రెడ్డి బాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

● చింతపల్లి డివిజనల్ అటవీ అధికారి సూర్యనారాయణ



చింతపల్లి రూరల్: ఎండాకాలం నేపథ్యంలో అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక డివిజనల్ అటవీ అధికారి సూర్యనారాయణ గురువారం తెలిపారు. ఇప్పటి వరకు డివిజన్‌లో 28 ఫైర్ పాయింట్లను గుర్తించామన్నారు. గిరిజనులు బాగా ఎండిన ఆకులు, చెట్ల వద్ద బీడీలు, అగ్ని ప్రమాదం సంభవించే కార్యకలాపాలు చేయొద్దన్నారు. తేనె, బొడెంగులు, చీపుర్లు మొదలగునవి సేకరించే పనిలో కాగడాలు ఉపయోగించి నిర్లక్ష్యంగా పడేయొద్దన్నారు. ఇలా చేయడం వల్ల పరిసర ప్రాంతాల్లో వృక్షజాతి అంతరించడంతోపాటు భూమిలో తేమ ఆవిరై నేల పొడి బారిపోతుందన్నారు. తద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుదన్నారు. అగ్ని ప్రమాదాలపై లోతుగెడ్డ (9849248094), సీలేరు (9491516238), మర్రిపాకలు (9246743839), పెదవలస (949429 9705), ఆర్.వి.నగర్ (9111222259), చింతపల్లి (9849248094) కేంద్రాల నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా తులసీదళార్చన

విశాఖ: : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారికి గురువారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

కేజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం



కేజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్ ప్రారంభ కార్యక్రమంలో సూపరిండెంటెండెంట్ అశోక్‌కుమార్ తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో న్యూరాలజీ విభాగంలో గురువారం స్ట్రోక్ యూనిట్ ప్రారంభమైంది. ఆరు పడకలతో ఈ యూనిట్‌ను సూపరిండెంటెండ్ డాక్టర్ పి.అశోక్‌కుమార్,ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి, సీనియర్ న్యూరాలజిస్టు రిటైర్డు విభాగాధిపతి డాక్టర్ కె.వేంకటేశ్వర్లు, ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ వై.ప్రభాకరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ ప్రాక్టీసింగ్ న్యూరాలజిస్టు డాక్టర్ భాగ్యరేఖ, డాక్టర్లు ప్రదీప్, రోహిత్, సుష్మ,మనోజ్,సతీష్, ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీ, ఏడీ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలకు 27 మంది ఖైదీలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఈ ఏడాది ఓపెన్ పరీక్షలు రాయడానికి 27 మంది ఖైదీలు సిద్ధమవుతున్నారు. పదో తరగతి ఓపెన్ పరీక్షలు 9 మంది, ఇంటర్మీడియట్ 18 మంది ఓపెన్‌లో పరీక్షలు రాయనున్నట్లు జైల్ అధికారులు తెలిపారు. వీరికి ఈ ఏడాది మార్చి 18 నుంచి ఓపెన్ పరీక్షలు జరగనున్నాయి.

రోజూ టాటానగర్-ఎర్నాకుళం బై వీక్లీ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా టాటానగర్- ఎర్నాకుళం- టాటానగర్ మధ్య వారానికి రెండు రోజులు నడుస్తున్న బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఇకపై ప్రతిరోజు నడుస్తుందని వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. టాటానగర్‌లో ఈనెల 7వ తేదీ నుంచి బయల్దేరే టాటానగర్-ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 10 నుంచి ఎర్నాకుళంలో బయల్దేరే ఎర్నాకుళం-టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు బయల్దేరుతుంది. ప్రయాణికుల ఈ సదుపాయాన్ని వినియోగించుకు సుఖవంతమైన ప్రయాణం సాగించాలని రైల్వే అధికారుల కోరారు.

గంజాయి తరలిస్తున్న ఒడిశా మైనర్ అరెస్ట్



రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: గంజాయి తరలిస్తున్న మైనర్‌ను విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ ఎస్.చిట్టిబాబు సిబ్బందితో గురువారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన మైనర్ బ్యాగును తనిఖీ చేయగా.. అందులో ఏడు కిలోల గంజాయిని గుర్తించారు. అతను రైలులో విశాఖపట్నం మీదుగా ముంబయికి గంజాయికి తీసుకెళ్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. అతన్ని జువైనల్ హోంకు అప్పగించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగులకు డిజిటల్ విద్య చేరువ చేయాలి

అనకాపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డిజిటల్ విద్య అందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా పరిశీలకులు డాక్టర్ వై. నరసింహం అన్నారు. గ్రేటర్‌విశాఖ విలీన గ్రామమైన కొప్పాక ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని ఆయనతో పాటు జిల్లా సహిత విద్యా సమన్వయ అధికారి శకుంతల గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సేవలు, సదుపాయాలను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, వరప్రసాద్, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయురాలు రమాదేవి, దివ్యాంగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు జగనన్న సైనికులు



చింతూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



చింతూరులో వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

వలంటీర్లకు వందనం కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: ప్రతి గడపకు సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వలంటీర్లు జగనన్న సైనికులని, ఆయన నమ్మకం వారేనని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పథకాల కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ఇంటి వద్దకే పథకాలను అందిస్తున్న ఘనత వలంటీర్లకు దక్కుతుందన్నారు. సేవాగుణం ఎంతో గొప్పదని, సొంత కుటుంబాలకు సేవ చేయడం ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తుందన్నారు. వేతనాలు తక్కువైనా ఎంతో దయాగుణంతో వారు సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న ప్రతి కుటుంబం ఆశీస్సులు ఎల్లప్పుడూ వలంటీర్లకు ఉంటుందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని నిందలు వేసినా ఎంతో ధైర్యంగా నిలబడి వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖు ఉదయం అవ్వాతాతలకు పింఛన్లు ఇవ్వడం దగ్గర నుంచి కరోనా, వరదల్లో ప్రజలకు అందించిన సేవలను అభినందించాల్సిందేనన్నారు. చింతూరు మండలంలో ఐదుగురిని సేవా రత్న, 231 మందిని సేవా మిత్ర పురస్కారాలతో ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీడీవో రవిబాబు, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్‌అలీ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి శ్యామల విజయ్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు ఇల్లా మురళి, రాంబాబు, రాజు, సాయిబాబు, జిక్రియా, సుజాత, రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కోళ్లకు కొక్కెర తెగులుపై అప్రమత్తం



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్థక శాఖ ఏడీ చంద్రశేఖర్

చింతపల్లి రూరల్: కోళ్లకు సోకే కొక్కెర తెగులుపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా గురువారం గిరిజన రైతులకు స్థానిక పశువైద్య శాఖ కార్యాలయంలో ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో కోళ్లకు ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. ఇది సోకిన కోళ్ల ముక్కులో నీరు కారడం, గురక రావడం, మెడ తిరిగి పోవడం , కాళ్లు పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. దీనికి చికిత్స లేదు, నివారణ మాత్రమే సాధ్యమన్నారు. ఈ వ్యాధి సోకిన కోడిని మిగిలిన కోళ్లతో కలపకుండా దూరంగా ఉంచాలన్నారు. మూడు నెలలకోసారి యాంటీవైరల్ స్ప్రే పిచికారీ చేయడం, లేదా లసోటా, ఎఫ్1 వ్యాక్సిన్ వేయడం ద్వారా తెగులును నివారణ చేయవచ్చన్నారు. పశు సంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నృసింహ యజ్ఞం టికెట్ల విక్రయాలు ప్రారంభం



తొలిటికెట్టును కొనుగోలు చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం : సింహగిరిపై ఈనెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సుదర్శన నారసింహ మహాయజ్ఞం వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. యజ్ఞంలో పాల్గొనే ఉభయదాతలు (దంపతులు)కు రూ.3వేల టికెట్టు నిర్ణయించామన్నారు. యజ్ఞం నిర్వహణకు సంబంధించి భక్తులకు పూర్తి వివరాలు తెలియజేసేందుకు సింహగిరిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమాచార కేంద్రాన్ని గురువారం ఈవో ప్రారంభించారు. అలాగే తొలి టికెట్టును కొనుగోలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 తర్వాత మళ్లీ పెద్ద ఎత్తున మహా యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. మరో మూడు రోజుల్లో ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గుగుల్‌పే, ఫోన్‌పే ద్వారా కూడా టికెట్లు కొనుగోలు చేసే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యజ్ఞాన్ని పురస్కరించుకుని ఈనెల 26నుంచి ఏప్రిల్ 1వరకు సింహగిరిపై ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు దేవస్థానం ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తెలిపారు. దేవస్థానం ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, సువ్వాడ శ్రీదేవి, దశమంతుల రామలక్ష్మి, ముదుండి రాజేశ్వరి, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు భ్రమరాంబ, పాలూరి నరసింగరావు దేవస్థానంకి విశిష్టతదాతలు బోకం శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

గంభీరంలో అమానుషం

పసికందును వదిలిపెట్టిన తల్లి



పసికందు మృతదేహం

ఆనందపురం: ఆ చిన్నారి.. ఆడపిల్లగా జన్మించడమే పాపమైంది. పుట్టి పుట్టగానే ఆ బిడ్డను గ్రామ శివారున విడిచి పెట్టి వెళ్లిపోయింది ఓ తల్లి. గుక్క పెట్టి ఏడ్చిన ఆ పసికందు కథ చివరకు విషాదాంతమైంది. ఈ అమానుష ఘటన గంభీరంలో గురువారం వెలుగు చూసింది. గంభీరం గ్రామ శివారున గల ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రైవేట్ విద్యా సంస్థ కళాశాలను నిర్వహిస్తోంది. గురువారం ఉదయం కళాశాల ప్రహరీ పక్కన నిర్జీవంగా పడి ఉన్న ఆడ పసికందుని సిబ్బంది గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ టి.వి.తిరుపతిరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని విచారణ జరిపారు. సంఘటన జరిగి ఓ రోజై ఉండొచ్చని భావిస్తున్నారు. పూర్తిగా నెలలు నిండి ప్రసవం అనంతరం బిడ్డను పారేసినట్టు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ సంఘటన స్థానికంగా జరిగిందా లేదా ఎవరైనా ఇక్కడకు తెచ్చి పసికందును పడేశారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కేసును సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

ఎడెక్స్ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి



సదస్సు ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ వెంకట సుబ్బయ్య

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఎడెక్స్ కోర్సులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేఎన్‌టీయూ- విజయనగరం వైస్ చాన్సలర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం భీమిలి మండలం దాకమర్రి రఘు విద్యాసంస్థలలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సులో ఆయన 3వ వైర్‌లెస్, యాంటినా మైక్రోవేవ్ సింపోజియాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన ఎడెక్స్ కోర్సులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. డాక్టర్ పీఎస్ఆర్ చౌదరి మాట్లాడుతూ ఐట్రిపుల్‌ఈ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సు నూతన జ్ఞానాన్ని బదలాయింపు చేసుకోవడానికి వేదికగా నిలుస్తుందన్నారు. అమెరికాకు చెందిన రావు ఎస్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు సుధాకరరావు, నాసా జేఎల్‌పీ ల్యాబ్స్ ప్రతినిధులు నాసిర్ చాహత్, గౌరంగి గుప్తా, డెస్మండ్, ఆర్.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించాల్సిందే

- సుప్రీంకోర్టు ఆదేశాలు పక్కాగా అమలు
- వారం రోజుల్లో కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించాలి
- నిబంధనలు పాటించకపోతే కేసులు
- ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

అల్లిపురం: మోటారు వాహనాల చట్టం నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇకపై నాలుగు చక్రాలు, ఆపై వాహనాల ముందు, వెనుక, ఇరువైపులా అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించాలని నగర ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు తెలిపారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఏసీపీ రాజీవ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, అక్రమ రవాణా, కిడ్నాప్ తదితర నేరాలను అరికట్టేందుకు వాహనాలకు బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. వారం రోజులు సమయం ఇస్తున్నామని అప్పటికీ వాహన యజమానులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. రూ.300 జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో నగరంలో వివిధ స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.